క్లుప్తంగా

కంటి పాపలను కాపాడుకోవాలి



విద్యార్థులకు కళ్లద్దాలు అందిస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: ప్రతీ ఒక్క విద్యార్థి కంటి పాపలను కాపాడుకోవాలని, దృష్టిలో లోపాలుంటే వెంటనే వైద్యులకు చూపించుకోవాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా ఉమెన్స్ ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాలలో కంటి పరీక్షలు చేపట్టారు. విద్యార్థులందరికీ కంటి పరీక్షలు చేసి 31 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ప్రమోద్, ప్రిన్సిపాల్ సునీత, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, గోలి శ్రీనివాస్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలి



నర్సరీ పరిశీలిస్తున్న ఎంపీవో రవిబాబు

జగిత్యాలరూరల్: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని జగిత్యాల రూరల్ ఎంపీవో రవిబాబు అన్నారు. మండలంలోని పొరండ్ల గ్రామంలో నర్సరీ, రక్షిత మంచినీటిని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వేసవికాలం కావడంతో గ్రామంలో అన్ని కాలనీలకు తాగునీరందేలా చూడాలన్నారు. అలాగే నర్సరీల్లో ఏర్పాటు చేసిన మొక్కల సంరక్షణకు దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ కిరీటి, కారోబార్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

దేశభక్తి పెంపొందించుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఏఎస్పీ

జగిత్యాల: ప్రతీ ఒక్క విద్యార్థి దేశభక్తి పెంపొందించుకోవాలని ఏఎస్పీ భీంరావ్ అన్నారు. మంగళవారం జ్యోతి హైస్కూల్‌లో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏఎస్పీ భీంరావ్, డీఈవో రాము పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కౌట్ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే దేశభక్తి, దైవభక్తి అవలంభిస్తుదన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిషనర్ హరిచరణ్‌రావు, సెక్రటరీ మధు, విద్యార్థులు పాల్గొన్నారు.

నృసింహుని బ్రహ్మోత్సవాలకు విద్యార్థులు



ధర్మపురికి బయల్దేరుతున్న విద్యార్థులు

జగిత్యాల: ధర్మపురి దేవస్థానంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు జగిత్యాల ఎస్‌కేఎన్ఆర్ కళాశాలకు చెందిన 50 మంది విద్యార్థులు వెళ్లినట్లు కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ తెలిపారు. మంగళవారం వారు వెళ్లే బస్సును జెండా ఊపి ప్రారంభించారు. జాతరలో సేవ కోసం విద్యార్థులు వెళ్లారని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా, ట్రాఫిక్ జామ్ కాకుండా చిన్నపిల్లలు, వృద్ధులకు సహాయ చర్యలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారి శ్రీనివాస్, డాక్టర్ సుజాత పాల్గొన్నారు.

మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

జగిత్యాల: మై భారత్ పోర్టల్‌లో ప్రతీ ఒక్కరు నమోదు చేసుకోవాలని ఎస్‌కేఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. మై భారత్ పోర్టల్ పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వికసిత్ భారత్ నోడల్ జిల్లాగా జగిత్యాల ఎంపికైందని, ప్రతీ ఒక్కరూ ఇందులో పాల్గొనాలన్నారు. ఈ నోడల్ పరిధిలో నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాలు వస్తాయన్నారు. ప్రతి విద్యార్థి వికసిత్ భారత్ యువ పార్లమెంట్ అనే అంశంపై ఒక నిమిషం వీడియో అప్‌లోడ్ చేయాలన్నారు. సందేహాలుంటే 94906 83621 సంప్రదించాలని కోరారు.

డంపింగ్ యార్డులో మంటలు

- సెగ్రిగేషన్ చేయకపోవడంతోనే
- పొగతో ఇబ్బంది పడుతున్న ప్రజలు
- బల్దియాకు అదనపు ఖర్చు

జగిత్యాల: మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం... పట్టింపులేని ధోరణి... ఫలితంగా నూకపల్లి డబుల్‌బెడ్ రూంలో ఉన్న ప్రజలతో పాటు, నర్సింగాపూర్, టీఆర్‌నగర్ గ్రామాల ప్రజలు డంపింగ్‌యార్డులో వెలువడుతున్న పొగతో నానా ఇబ్బందులు పడుతున్నారు.

నిత్యం మంటలే...

డంపింగ్‌యార్డు ప్రాంతంలో నర్సింగాపూర్ ,న్యాక్ కేంద్రం,డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఉన్నాయి. డబుల్ బెడ్ రూం ఇళ్లలో సుమారు 20 కుటుంబాల వరకు ఉంటున్నారు. త్వరలోనే అనేక మంది వచ్చే అవకాశాలున్నాయి. తడి, పొడి చెత్త వేరు చేయకపోవడం, పట్టణంలోని చెత్తను తీసుకువచ్చి డంపింగ్‌యార్డులో పడేస్తున్నారు. దీంతో మంటలు అంటుకుని విస్తృతంగా పొగ వ్యాపిస్తోంది. జనవరిలో ఒక వారం రోజుల పాటు దట్టమైన పొగలు కమ్ముకుని ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. మున్సిపల్ అధికారులు నానా తంటాలు పడి మంటలార్పారు. తాజాగా మళ్లీ డంపింగ్‌యార్డు అంటుకోవడంతో నాలుగు రోజులుగా మున్సిపల్ అధికారులు మంటలార్పుతున్నా.. చెలరేగుతూనే ఉన్నాయి. దీంతో ఆ ప్రాంతంలో ప్రజలు శ్వాస తీసుకోవడానికి కూడా కష్టతరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. న్యాక్ కేంద్రంలో శిక్షణ పొందుతున్న నిరుద్యోగులు కూడా ఇబ్బంది పడుతున్నారు.

కాలుష్య కోరల్లో కాలనీలు...

డంపింగ్‌యార్డు అంటుకుని నిత్యం ఆ కాలనీలన్నీ కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయి. పొగ వస్తే మనుషుల గుండె, ఊపిరితిత్తులపై అధిక ప్రభావం పడుతుంది. మనుషుల ఆరోగ్యంతో పాటు, పర్యావరణాన్ని దెబ్బతీసే కాలుష్య కారకాలు ఉంటాయి. వృద్ధులు, పిల్లలు శ్వాసకోశా వ్యాధులున్న వారిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుంది.



డంపింగ్‌యార్డులో మంటలతో న్యాక్ కేంద్రంలోకి వెళ్తున్న పొగ



మంటలు ఆర్పుతున్న బల్దియా సిబ్బంది

బల్దియాకు అదనపు భారం..

డంపింగ్‌యార్డులో తరుచూ మంటలు రేగడంతో బల్దియాకు భారంగా మారింది. నిత్యం అక్కడ 10 మంది సిబ్బందితో పాటు, ఒక జేసీబీ, మంటలు ఆర్పడానికి వాటర్, వివిధ వాహనాలను వినియోగించాల్సి వస్తోంది. దాదాపు రోజుకు కొన్ని వందల లీటర్ల డీజిల్ మంటలు ఆర్పడానికి వినియోగిస్తున్నారు. అయినప్పటికీ మంటలు చల్లారడం లేదు. ఎండలు ముదరుతున్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి డంపింగ్‌యార్డు వద్ద మంటలు రేగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

డంపింగ్ యార్డు తరలించాలని ఎమ్మెల్సీకి వినతి

జగిత్యాల టౌన్: డంపింగ్ యార్డును అక్కడి నుండి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ జగిత్యాల అర్బన్ కాలనీ వాసులు మంగళవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చారు.

మంటలార్పేలా చర్యలు



మంటలు ఆర్పేలా చర్యలు తీసుకుంటున్నాం. ఎండాకాలం కావడంతో కొంత ఇబ్బందికరంగా ఉంది. ఏదో ఒక చోట మంటలు అంటుకుంటున్నాయి. నిత్యం వాటర్‌తో ఆర్పేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా వెంటనే మంటలార్పేలా చర్యలు తీసుకుంటున్నాం.

– చిరంజీవి, మున్సిపల్ కమిషనర్,జగిత్యాల



సారంగాపూర్: మండలంలోని పోచంపేట గ్రామ శివారుల్లో నిర్మించిన దోభిఘాట్ నిరుపయోగంగా మారింది. ఈ దోభిఘాట్‌కు పక్కనే వాటర్‌ట్యాంక్ అందుబాటులో ఉంది. అధికారులు ఏ కొంత చొరవచూపినా దోభిఘాట్‌కు నీటి కనెక్షన్ ఇచ్చి వినియోగంలోకి తీసుకరావచ్చు. దోభిఘాట్ అవసరం లేదనుకుంటే పశువులు నీరు తాగడానికి పశువుల తొట్టిగా ఉపయోగించవచ్చు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
గంగాధర్ , ఎంపీడీవో సారంగాపూర్,సెల్ నం: 9440468508

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్/మేడిపల్లి: ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని తాండ్య్రాల ప్రభుత్వ పాఠశాలలో రూ.12 లక్షలతో నిర్మించనున్న అదనపు తరగతి గది, రూ.20 లక్షలతో నిర్మించనున్న పల్లె దవాఖానా భవనానికి మంగళవారం భూమిపూజ చేశారు. గంభీర్‌పూర్ జెడ్పీ హైస్కూల్‌లో కంటి సమస్యతో బాధపడుతున్న విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. గంభీర్‌పూర్‌లో శ్రీలక్ష్మీనృసింహస్వామి, తక్కళ్లపల్లిలో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. ఏఎంసీ చైర్మన్ నారాయణరెడ్డి, తహసీల్దార్ వినోద్, ఎంపీడీవో శంకర్, ఎంఈవో శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు. అనంతరం మేడిపల్లి మండలం గోవిందారం, ఈదులలింగంపేట, భీమారం, కొండాపూర్, మేడిపల్లి, కట్లకుంట గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భీమారంలో ఎంపీడీవో కార్యాలయం, కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు.



పల్లె దవాఖానాకు శంకుస్థాపన చేస్తున్న విప్

పోలీస్ బ్యాండ్ మేళాకు ప్రాధాన్యం

జగిత్యాలక్రైం: పోలీసు శాఖలో పోలీసు కవాతు నిర్వహించేడంలో పోలీసు బ్యాండ్ మేళాకు ఎంతో ప్రాధాన్యం ఉందని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీసులు బ్యాండ్ మేళా సిబ్బందికి స్పోర్ట్స్ డ్రెస్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీసు కవాతు ఉత్సాహంగా నిర్వహించడంలో బ్యాండ్ ప్రాముఖ్యత చాలా అవసరమని, బ్యాండ్ ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీంరావు, రిజర్వ్ ఆర్ఐ వేణు పాల్గొన్నారు.

యాదవుల చైతన్యానికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న మల్లేశ్ యాదవ్

కోరుట్ల రూరల్: జిల్లాలో యాదవుల సంక్షేమానికి అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని జిల్లా యాదవ సంఘం అడ్ హక్ కమిటీ అధ్యక్షుడు గణవేణి మల్లేశ్ యాదవ్ అన్నారు. మండలంలోని యూసుఫ్‌నగర్‌లో మంగళవారం యాదవ సంఘ సమావేశం నిర్వహించారు. యాదవ విద్యావంతులు, మేధావులు ముందుకు రావాలని ఆయన కోరారు. యాదవుల సమస్యలు, హక్కుల సాధన, సభ్యత్వాల ద్వారా బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తొట్ల చిన్నయ్య, ముక్కెర నడిపి లింబాద్రి, సాగర్, గంగాధర్ పాల్గొన్నారు.

పంటపొలాలు పరిశీలన

మేడిపల్లి: భీమారం మండల పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. భీమారం, కమ్మరిపేట గ్రామాల్లో సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను కలిసి ప్రస్తుత వాతావరణ మార్పులతో సాగునీటి ఎద్దడిని ఎలా ఎదుర్కోవాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి షాహిద్ అలీ, సురేందర్ నాయక్, నరేందర్ నాయక్ రైతులు పాల్గొన్నారు.

ఫిల్టర్‌బెడ్ ఆధునీకరణకు కృషి

కోరుట్ల: పట్టణంలో మాజీమంత్రి జువ్వాడి రత్నాకర్ రావు హయాంలో నిర్మించిన ఫిల్టర్ బెడ్ ఆధునీకరణ కోసం నిధులు మంజూరుకు కృషి చేస్తామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఈ మేరకు ఫిల్టర్ బెడ్‌ను మంగళవారం కృష్ణారావు పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ రామకృష్ణా, రమేష్, నయీం,రిజ్వాన్, లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలి

సారంగాపూర్: నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో చౌడారపు గంగాధర్ అన్నారు. మంగళవారం ఆయన రేచపల్లి,లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. అనంతరం మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, ఈజీఎస్ సిబ్బందితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. గ్రామాల్లో వందశాతం ఇంటిపన్నులు వసూళ్లు జరగాలని, తాగునీటి సమస్య, ఇందిరమ్మ ఇళ్లపై సమీక్షించారు. సమావేశంలో సూపరింటెండెంట్ కృష్ణారెడ్డి, ఎంపీవో సలీం, ఏపీవో శ్రీలత, పీఆర్ ఏఈ రాజమల్లయ్య పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల్లో గోడ గడియారం

జగిత్యాల: ఇంటర్‌బోర్డు సెక్రటరీ ఆదేశాల మేరకు అన్ని పరీక్ష కేంద్రాల గదుల్లో గోడగడియారం ఏర్పాటు చేసినట్లు ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి నారాయణ తెలిపారు. ఐదో రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, 96.9 శాతం హాజరైనట్లు ఆయన తెలిపారు.

భక్తులకు ఇబ్బంది రానీయొద్దు



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహుని బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచించారు. వాహనాలను కేటాయించిన పార్కింగ్ స్థలాల్లోనే నిలిపేలా చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించారు. వేసవిలో తాగు, సాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని పేర్కొన్నారు. సంబంధిత అధికారులతో సమీక్షించారు. అనంతరం స్థానిక ఓల్డ్ టీటీడీ కల్యాణ మండపంలో భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి హాజరయ్యారు.

నృసింహస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జున్ను రాజేందర్, నాయకులు ఉన్నారు.

హామీలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యమకారులు

జగిత్యాల: ఉద్యమకారుల హామీలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంగళవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో ఉద్యమకారుల సమస్యలు, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో టీయూఎఫ్ చైర్మన్ జువ్వాజి శంకర్, నాచుపల్లి రెడ్డి, రాగుల రాజు, భాతరపు లింగారెడ్డి, కన్వీనర్ ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

బతికపల్లిలో ‘పది’ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలి

పెగడపల్లి: మండలంలోని బతికపల్లిలో పదో తరగతి పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. మండలంలోని పెగడపల్లి, బతికపల్లి, సుద్దపల్లి, అయితిపల్లి, నామాపూర్, నంచర్ల ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీ, ఆదర్శ మోడల్ స్కూల్ విద్యార్థుల కోసం మండల కేంద్రంలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. మండలంలో మరెక్కడా పరీక్ష కేంద్రం లేక మండల కేంద్రానికి వచ్చి పరీక్షలు రాయాలంటే ఇబ్బంది పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. బతికపల్లిలో కేంద్రం ఏర్పాటు చేస్తే అందరికీ అందుబాటులో ఉంటుందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

నేటి నుంచి వెంకన్న స్వామి బ్రహ్మోత్సవాలు

ఇబ్రహీంపట్నం: మండలంలోని వేములకుర్తిలో బుధవారం నుంచి శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు.12న గోదావరి జలాలతో అభిషేకాలు, దేవతమూర్తుల స్థాపన, అగ్ని ప్రతిష్ఠా, హోమం, ధ్వజరోహణం, 13న స్వామి వారికి మూలవిరాట్‌కు పూలాభిషేకం, పూర్ణహుతి, బలిహారణం, 14న శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి కల్యాణం, రాత్రికి స్వామి వారిని రథంలో ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు.

హుండీ లెక్కింపు

మల్లాపూర్: మండలంలోని వెంకట్రావ్‌పేట గంగగౌరీశ్వర స్వామి ఆలయ హుండీ, టికెట్ల ఆదాయాన్ని దేవాదాయ, ధర్మదాయ జగిత్యాల డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి ఆధ్వర్యంలో అధికారులు, ఆలయ కమిటీ మాజీ పాలకవర్గం, నాయకులు మంగళవారం లెక్కించారు. మొత్తం రూ.1,00,430లు వచ్చాయని తెలిపారు. అధికారులు, వీడీసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డులకు విద్యార్థుల ఎంపిక

ఇబ్రహీంపట్నం: మండలంలోని కోమటికొండాపూర్, వర్షకొండ, ఇబ్రహీంపట్నం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 2024, 2025 సంవత్సరానికి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైనట్లు ఎంఈవో మధు మంగళవారం తెలిపారు. విదార్థినులు ముక్కెర రణుష, దుబ్బాక ప్రగతి,ఆరెపెల్లి సాయిచందనలు పంపిన ఎగ్జిబిట్‌లు ఎంపికయ్యాయని పేర్కొన్నారు. ఎంపికైన ఒకొక్క విద్యార్థికి రూ. 10వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాలో వేయనున్నట్లు తెలిపారు. ఈ నగదుతో గైడ్ టీచర్ మార్గదర్శకంలో ఎగ్జిబిట్స్ తయారు చేసి జిల్లా స్థాయిలో నిర్వహించే సైన్స్ ఫేర్‌లో ప్రదర్శిస్తారని ఎంఈవో తెలిపారు.

మండలంలో 4 ఎస్సెస్సీ పరీక్ష కేంద్రాలు

కథలాపూర్: మండలంలో నాలుగు ఎస్సెస్సీ పరీక్ష కేంద్రాలు కేటాయించారని ఎంఈవో శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. కథలాపూర్ మోడల్ స్కూల్‌లో 230 మంది విద్యార్థులకు, జెడ్పీ హైస్కూల్‌లో 100 మంది విద్యార్థులకు, గంభీర్‌పూర్ జెడ్పీ హైస్కూల్‌లో 56 మంది విద్యార్థులకు, అంబారిపేట జెడ్పీ హైస్కూల్‌లో 80 మంది విద్యార్థులకు కేటాయించారన్నారు. పరీక్ష కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు ఏర్పాట్లు చేస్తున్నారని ఎంఈవో పేర్కొన్నారు.

15న యువ ఉత్సవ్

జగిత్యాలటౌన్: నెహ్రూ యువ కేంద్ర జగిత్యాల జిల్లా ఆధ్వర్యంలో ఈనెల 15న యువ ఉత్సవ్ నిర్వహించనున్నట్లు జిల్లా యువజన అధికారి రాంబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 15 ఏళ్ల నుంచి 29 ఏళ్ల లోపు యువతీయువకులు ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కవిత్వం, పెయింటింగ్,మొబైల్ ఫొటోగ్రఫీ, ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 15న జేఎన్టీయూ కొండగట్టులో నిర్వహించే కార్యక్రమానికి ఆసక్తి గల యువతీయువకులు నేరుగా హాజరు కావచ్చని తెలిపారు.

బాధ్యతలు స్వీకరణ

ఇబ్రహీంపట్నం: మండల పంచాయతీ అధికారిగా అబ్బుటి వెంకట రామకృష్ణరాజు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఎంపీవోగా పనిచేసిన చంద్రశేఖర్‌కు ఎంపీడీవోగా పదోన్నతి లభించడంతో ఖాళీ ఏర్పడింది. బీర్‌పూర్ మండలం నుంచి ఏపీ రామకృష్ణరాజు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా రామకృష్ణరాజుకు కార్యదర్శులు సన్మానించి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

నేటి నుంచి మార్కెట్‌కు సెలవు

మెట్‌పల్లి: హోలీ పండుగను పురస్కరించుకుని మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుకు బుధవారం నుంచి ఆదివారం వరకు సెలవులు ప్రకటించినట్లు చైర్మన్ కూన గోవర్దన్, కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. తిరిగి సోమవారం నుంచి పసుపు కొనుగోళ్లు ప్రారంభమవుతాయని, దీనిని రైతులు గమనించాలని పేర్కొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

- 5తులాల బంగారం.. రూ.25వేలు అపహరణ

మల్యాల: మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి బీరువాలోని ఐదు తులాల బంగారం, నగదు ఎత్తుకెళ్లారు. విద్యానగర్‌కు చెందిన షేక్ అరీఫ్ ఇంటికి తాళం వేసి సోమవారం బంధువుల ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఇంటికి తిరిగి రాగా తాళం తెరిచి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని బంగారం, డబ్బులు కనిపించలేదు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఫింగర్‌ప్రింట్ బృందం బీరువాపై ఉన్న వేలిముద్రలను సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ కుమార్ తెలిపారు.

మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఉస్మాన్‌పురకు చెందిన ఖాజా మొయినొద్దీన్‌కు స్థలం అద్దెకిస్తామంటూ మోసం చేసిన మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన గౌస్‌పాషాపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై మన్మధరావు తెలిపారు. ఉస్మాన్‌పురకు చెందిన ఖాజా మొయినొద్దీన్ 2023లో జగిత్యాలలో ఫ్యామిలీ రెస్టారెంట్ పెట్టేందుకు స్థలం కోసం వెతుకుతుండగా గౌస్ పాషా తాను కోండ్ర గంగారాం వద్ద 360 గజాల భూమిని అద్దెకు తీసుకున్నానని, తిరిగి ఖాజా మొయినొద్దీన్‌ను ఇస్తానని నమ్మించి అతని వద్ద రూ.2.20 లక్షల నగదుతో పాటు, రూ.3.60 లక్షల విలువ గల మరమ్మతు పనులు చేయించుకున్నారు. అగ్రిమెంట్ చేయక మోసం చేయడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు గౌస్‌పాషాపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పశు పోషణతో రైతులకు అదనపు ఆదాయం

కోరుట్లరూరల్: పశుపోషణతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందని జిల్లా సంక్షేమ అధికారి బి.నరేష్ అన్నారు. పట్టణంలోని పీవీ.నర్సింహారావు పశువైద్య కళాశాలలో జాతీయ మాంస పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కిసాన్‌మేళా నిర్వహించారు. ఆధునిక పద్ధతిలో వ్యవసాయం, పశుపోషణకు సంబంధించిన పరికరాలు, వివిధ శాఖలు రూపొందించిన ఉత్పత్తులను ప్రదర్శించారు. రైతులకు ఉపయోగపడే ఖనిజ లవణ మిశ్రమం, నట్టలనివారణ మందులు, మేలు రకం విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఎన్ఎంఆర్ఐ సంచాలకులు బార్బురే, పీవీ.నర్సింహారావు పశువైద్య కళాశాల రిజిస్ట్రార్ ఏ. శరత్ చంద్ర, కళాశాల అసోసియేట్ డీన్ దాసరి శ్రీనివాస్, పరిశోధనా సంచాలకులు సీహెచ్.హరికృష్ణ, శాస్త్రవేత్త బసవారెడ్డి, జిల్లా పశువైద్య అధికారి ఎస్ఎల్.మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై ఫిర్యాదు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మారుతీనగర్‌లో ఓ ఇంట్లో జరిగిన దాడి ఘటనపై కోరుట్లకు చెందిన అస్గర్‌హుస్సేన్ మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. తన అక్కబావకు గొడవ జరుగుతోందనే సమాచారంతో మారుతీనగర్‌లోని వారి ఇంటికి వెళ్లగా.. తనతోపాటు తన తమ్ముడిపై బావ, అతడి సోదరుడు కత్తితో దాడికి పాల్పడ్డారని, ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఘనంగా లక్ష్మీనృసింహస్వామి కల్యాణం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారికి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరై కల్యాణాన్ని తిలకించారు.